


# తప్పటడుగులు

సుస్మితా రమణమూర్తి

"మమ్మీ! మా మేస్టారు ఈ ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం పెట్టించి తీసుకురమ్మన్నారు." ప్రోగ్రెస్ కార్డు పట్టుకుని భయం భయంగా తల్లి ముఖంలోకి చూస్తూ చెప్పాడు మురళి. "మార్కులెలా వచ్చాయిరా? బాగా వచ్చాయా?" తను వెళ్ళబోయే మహిళామండలి మీటింగుకి తయారవుతూ అడిగింది భారతి.

మురళి మౌనం వహించాడు.

"పోయి మీ డాడీని సంతకం చేయమను. నా కవతల అర్జంటు మీటింగొకటుంది." అంటూ తన అలంకరణలో మునిగిపోయిం దామె. మురళి మాట్లాడకుండా

తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"ఏం, మురళీ! ప్రోగ్రెస్ కార్డొచ్చిందా?" అంటూ మురళి చేతిలోంచి దాన్ని అందుకున్నాడు భాస్కర్.

కొన్ని క్షణాలు మార్కుల వేపు—మురళివేపు దృష్టి సారించిన భాస్కర్ ముఖంలో కోప చిహ్నాలు కొట్టొచ్చినట్లు కన్పించడంతో మురళి భయపడిపోతూ తల దించుకున్నాడు.

"ఎప్పుడైనా చదువు మీద ధ్యాసుంచి చదివితేనే గదా?.... బుర్రెక్కడో వుంచుకుని చదువు సాగిస్తే ఇలానే తగలపడతాయ్ మార్కులు! ఏ సబ్జెక్టులోనూ పట్టుమని నలభై మార్కులు రాలేదు. ఇలాగైతే ముందు ముందు పరీక్షలు పాసయినట్లే!..." సంతకం చేస్తూ భాస్కర్ చీవాట్ల అక్షింతలు వేశాడు మురళి మీద. మురళి మౌనంగా వుండిపోయాడు.

"నీ కెన్నోసార్లు చెప్పాను. పాఠాలేమైనా అర్థం కాకపోతే నన్నడగరా-అని! లెక్కలేమైనా చేయలేకపోతే నాతో చెప్పించుకోరా—అని! ఏరా! 'అన్ని ప్రశ్నలకు జవాబులు కంఠస్తా వచ్చా?' లెక్కలన్నీ నీ అంతట నువ్వే చేయగలుగుతున్నావా?' అని అడిగినప్పుడల్లా తాటికాయలా బుర్ర ఆడించటం మినహా ఎప్పుడైనా ఫలానాది నాకు అర్థం కావటం లేదని అడిగావా? మొక్కుబడికి స్కూలుకి వెళ్ళడం రావడం మాత్రం బాగా అలవాటైంది నీకు." ప్రోగ్రెస్ కార్డు మురళి ముఖం మీదకి విసిరేస్తూ చిరాగ్గా అన్నాడు భాస్కర్.

మురళి కిక్కురు మనకుండా క్రిందపడిన ప్రోగ్రెస్ కార్డు తీసుకుని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు- ఇంకా ఏదైనా తండ్రి అంటాడేమోనన్న భయంతో.

స్కూల్లో మేష్టార్లకి నెలయ్యేసరికి అప్పనంగా జీతాలు అందుకోవడం మాత్రం బాగా తెల్సు. పిల్లలకి పాఠాలు తలకెక్కుతున్నాయో లేదో? తెల్సుకోవాలన్న విషయం మాత్రం వాళ్ళు పట్టించుకోరు.

"ఏమిటండీ? మా వాడికిలా వస్తున్నాయ్ మార్కులు?" అనడిగితే "మేము మాత్రం ఏం చేయగలం- చెప్పండి? ఒక్కో క్లాసుకి యాభయ్యేసి అరవయ్యేసి మంది పిల్లలున్నారు. అప్పటికీ మా శాయశక్తులా కృషి చేస్తూనే వున్నాం. మీరేమీ అనుకోనంటే ఒక్క విషయమండీ! పిల్లల్ని స్కూలుకి పంపించడంకంటే ఇంటి దగ్గర

తల్లి దండ్రులు పిల్లలచేత ఏ రోజు పాఠాల్ని ఆరోజే చదివించేలా చూడ్డం చాలా ముఖ్యమండీ!" అంటూ ఆ మేస్టారు తనకే చురక అంటించాడో సారి.

ఆ అనుభవంతో ఎందుకైనా మంచిదని ఆ రామం మాస్టారు దగ్గరే ట్యూషన్ పెట్టించినా ప్రయోజనం లేకపోయింది. ఇంటి దగ్గర తల్లి దండ్రులు ఎంతకని పిల్లల్ని కనిపెట్టుకుని వుండగలరు? ఎనిమిదో క్లాసు చదువుతున్నోడికి బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్న ఇంగిత జ్ఞానం వుండొద్దూ?....

మా కాలంలో ఈ ప్రయివేట్లు ఎరుగుదుమా?

రోజులిలా తగలడబట్టే అక్షరాలు దిద్దే దగ్గర్నుంచి పట్టాలు పుచ్చుకునే దాకా ప్రయివేట్లే!!....

ప్రయివేట్ కి పంపిస్తున్నా వీడి చదువు మెరుగుపడలేదు.

ఆ సుందర్రావు మేస్టారు అందరికంటే బాగా ట్యూషన్ చెబుతారని అంటున్నారంతా.

సరే! ఏ మేస్టరైతే యేమిటీ?

ఆ రామం మేస్టారికి పారేస్తున్న డబ్బులు ఈ నెలనుంచి ఆ సుందర్రావు మేస్టారికి పారేస్తే సరి! అప్పుడైనా వాడికి పరీక్షల్లో బాగా మార్కులొస్తాయేమో! అదీ చూద్దాం!...అలా ఆలోచనల అలల్లో తేలియాడిన భాస్కర్, మురళిని సుందర్రావు మేస్టారు దగ్గరకు ట్యూషన్ కి పంపడానికి నిశ్చయించుకున్నాడు.

భాస్కర్ ఓ చిన్న కంపెనీలో ఓ పెద్ద ఆఫీసరు. నాలుగంకెల జీతగాడు. ఆఫీసయ్యాక తర్వాత మిత్రులతో పిచ్చాపాటి—షికార్లు... అయిన తర్వాత అర్ధ రాత్రిగ్గాని ఇంటికి ముఖం పట్టడు భాస్కర్! ఇక భారతి సంగతి—మహిళా మండలి మీటింగులతోనే కాలమంతా గడచి పోతుంది తనకు.

స్కూల్లో మేస్టార్లు ఒకేసారి యాభై - అరవై మంది పిల్లలకు పాఠాలు అర్థమయేలా చెప్పడం ఎంత కష్టమైన విషయమో భాస్కర్ కి తెలియందేమీ కాదు.

అందుకే మురళికి ప్రయివేటు ఏర్పాటు చేశాడు.

ప్రయివేట్లు కూడా ఓ చిన్న సైజు స్కూల్సులా తయారవుతున్నాయన్న విషయం గురించి మాత్రం భాస్కర్ ఎప్పుడూ సీరియస్ గా ఆలోచించలేదు.

అందుకే ప్రయివేటుకి పంపిస్తున్నా మురళికి సరిగ్గా మార్కులు

రావటం లేదే?—అని వాపోతు న్నాడతను.

'పాఠాలేమైనా అర్థం కాక పోతే నన్నడగు!' అని అప్పు డప్పుడు భాస్కర్ మురళితో అనడం నామ మాత్రానికే గాని సాయంత్రం పూట ఎప్పుడైనా ఇంటిదగ్గర పట్టుమని ఓ గంటసేపు కూర్చుని మురళి చదువెలా సాగు తుందో-చూడ్డానికి తనకు అంత ఓపిక తీరిక ఎక్కడివి?....

ఎప్పుడైనా ప్రయివేటు మాస్టారు 'ఏమండీ! మీవాడీ మధ్య....' అని భాస్కర్ చెవిలో వూదితే తప్ప మురళి ప్రయివేటుకి వెళ్తున్నదీ లేనిదీ పట్టించుకునే నాధుడెవ్వడూ లేడు. 'స్కూల్లో అటెండెన్సుంటే అంతా పాసై పోతారు' అన్నధీమా ఇటు తల్లి దండ్రులకూ, అటు పిల్లలకూ కల గడం, ఒక విధంగా చెప్పుకోవా లంటే ప్రతి ఏటా 'డిటెన్షన్' పద్ధతి లేకపోవడమే కావచ్చు.

హాజరు బాగా వుంటే పాసై పోవచ్చన్న విషయం మురళి క్కూడా తెలియందేమీ కాదు. అందుకే బుద్ధిగా స్కూలుకి వెళ్ళి రావడం అలవాటు చేసుకున్నాడు. భాస్కర్ వెంటనే సుందర్రావు మాస్టార్ని కలిసి "మావాడు అన్నిం టిలోను చాలా వీక్‌గా వున్నా డండీ! ఇక మీదట అన్ని సబ్జెక్టుల లోనూ మంచి మార్కులొచ్చేలా చేసే పూచీ మీది!" అంటూ ఆయనకు మురళిని అప్పగించేడు.

"ఎనిమిదో క్లాసు, తొమ్మిదో క్లాసు కేవలం అటెండెన్సుంటే పాసైపోతారన్న విషయం మీకు తెల్సి కూడా - నా దగ్గరకు మీవాణ్ణి పంపిస్తున్నారంటే మీ ఆంతర్యం ఆ మాత్రం అర్థం చేసుకోగల నండీ!

ఈ రెండు క్లాసులు బాగా చదవకుంటే రాబోయే పదోక్లాసు పబ్లిక్ పరీక్ష పాసవడం కష్టం! అందుకని ఇప్పట్నుంచే మీ వాడిని ఓ దార్లో పెట్టడానికి ప్రయత్నిస్తా నండి!" అంటూ సుందర్రావు మాస్టారు భాస్కర్ దగ్గర్నుంచి అడ్వాన్సు తీసుకున్నారు. తను ఆశించినట్లే ఆ తర్వాత్తర్వాత పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లోను మురళికి మంచి మార్కులు రావడంతో కొడుకు భారమంతా సుందర్రావు మాస్టారు మీదే వేసి తృప్తి చెం దాడు భాస్కర్.

మురళి పాత ప్రయివేటు మాస్టారు రామం ఎన్నోసార్లు మురళి చదువు గురించి తనకు తోచిన విధంగా భాస్కర్‌తో

గొంతు చించుకున్నా భాస్కర్ పట్టించుకోలేదు.

ఇది వరకటి కంటే మురళికి మార్కులు బాగా వస్తున్నాయ్. మురళి ఎనిమిదో క్లాసు మంచి మార్కులతో పాసయ్యాడు. తొమ్మిదో క్లాసు కూడా మంచి మార్కులతోనే పాసయ్యాడు. ఈ సారి మాత్రం మురళి ప్రోగ్రెస్ రిపోర్టుల మీద గర్వంగా సంతకాలు చేశాడు భాస్కర్. పదో క్లాసులోకి వచ్చేడు మురళి. నెలలు ముందుకు జరిగాయ్. పబ్లిక్ పరీక్షలు ఓ నెల రోజులున్నాయనగా సుందర్రావు మాస్టారు ఒక్కో సబ్జెక్టుకి ఇరవయ్యేసి చాలా ఇంపార్టెంట్ ప్రశ్నలంటూ తన దగ్గర ట్యూషన్ చదువుకున్న నలభై మందికీ ఇచ్చారు.

అలాగే మిగతా మేస్టార్లు కూడా తమ దృష్టిలో విలువైన ప్రశ్నల్ని ఏరి-"ఇవి చదువుకోండర్రా! తప్పకుండా పాసవుతార"న్న హామీ ఇచ్చారు తమ పిల్లలకు.

ఒక్క రామం మాస్టారి వైఖరి ఇందుకు విరుద్ధమైంది. తన దగ్గర కూడా ఓ ఇరవై మంది ప్రయివేటుకి పిల్లలున్నారు. తన శాయశక్తులా సంవత్సరమంతా పాఠాలు అర్థమయ్యేలా పిల్లలకు విడమరచి చెప్పేరు.

తను చెప్పిన పాఠాలెంతవరకు పిల్లల బుర్రలకెక్కాయో తెల్సుకోవడం కోసం ఎప్పటి కప్పుడు పరీక్షలు పెట్టి సంతృప్తి చెందినా పబ్లిక్ పరీక్షలకు ముందుకూడా చివరిసారిగా అన్ని సబ్జెక్టుల్లోనూ పరీక్షలు పెట్టి 'ఫర్లేదు. వీళ్ళు తప్పకుండా పాసవుతారు' అన్న ధీమా పడి "ఇంకా బాగా చదవండి! పరీక్షలలో మీ కొచ్చింది స్పష్టంగా రాయండి. తప్పకుండా పాసవుతారు" అన్న అభయహస్తం ప్రసాదించారు పిల్లలకు.

ఎప్పట్నుంచో 'పబ్లిక్ ఎలా వుంటుందో? ఎలా వుంటుందో??' అని ఎదురు చూసిన ఆ పబ్లిక్ పరీక్షలు జరిగిపోయాయ్. 'ఫర్లేదు. పాసై పోవచ్చు!' అని కొంతమంది ధీమాతో ఫలితాలకోసం ఎదురు చూడ సాగేరు.

'ఏమో!....ఏ మవుతుందో?' అన్న భయంతో దిగులుతో ఎంతో మంది ఫలితాల కోసం ఎదురు చూడ సాగేరు.

పరీక్షా ఫలితాలు వచ్చాయ్.

రామం మాస్టారి ప్రయివేటు పిల్లలు ఇంచు మించు అంతా పాసయ్యారు.

సుందర్రావు మాస్టారి ప్రయివేటు వర్గంలో నూటికి ఓ పది మంది దాకా పాసయ్యారు. మురళి మాత్రం ఆ పదిమందిలో లేకపోవడంతో భాస్కర్ అదోలా ఫీల్ అయ్యాడు, బాధపడ్డాడు. 'వీడి భవిష్యత్తు గురించి ఎన్నెన్నో రంగు రంగుల కలలుకన్నానే! తీరా చూస్తే వీడు పదోక్లాసులోనే కూలబడి పోయాడే!' అని వాపోయేడు.

అన్ని సబ్జెక్టుల్లోనూ వెనుకబడి వున్నాడే!?....

ఇప్పుడేం చేయాలి? ఏం చేస్తే బాగుంటుంది??....

వీణ్ణి పాసయ్యేటట్టు చేయడమెలా??....అని తర్జన భర్జన పడుతున్న సమయంలో రామం మాస్టారు తన మస్తిష్కంలో మెదిలారు. దాంతో తన ఆలోచనల్లో గతం చోటు చేసుకుంది.

"భాస్కర్‌గారూ! మీ మురళిని నా దగ్గరకు ప్రయివేటుకి పంపించటం లేదనో లేక ఆ సుందర్రావు మాస్టారంటే నాకు కిట్టదనో మాత్రం మీరనుకోకుండా నేచెప్పేది కాస్త నిదానంగా ఆలోచించండి.

విద్యార్థి బాగు కోసం మంచి వుపాధ్యాయునిగా కొన్ని ముక్కలు మీకు చెప్పడం నావిధి అన్న భావంతోనే మీరు నన్ను కాదన్నప్పటికీ చెప్పాలనుకుంటున్నాను. ప్రస్తుతం మీ వాడికి పరీక్ష లన్నింటిలోను మంచి మార్కులు వస్తున్నాయ్. సంతోషించాల్సిన విషయమే!....ఆ మంచి మార్కులు ఎలా వస్తున్నాయో కాస్త ఆలోచించండి!....మీ వాడు నాదగ్గర చదువుతున్నప్పుడు పాఠాల్ని అర్థమయేలా చెప్పడానికి ప్రయత్నించాను. పరీక్షల్లో రాబోయే ప్రశ్నలకు మాత్రమే జవాబులు కంఠస్తం చేసేలా మాత్రం చేయడం నా అభిమతం కాదు కాబట్టి మీ వాడికి మార్కులు బాగా రాలేదు. మార్కుల మాటెలా వున్నా, అటెండెన్స్ వుంటే తొమ్మిదోక్లాసు దాకా పాసైపోవచ్చు. పదోక్లాసులో కాస్త సత్తా వున్న వాళ్ళు మాత్రమే పాసవగలరు. మిగతావాళ్ళు మరో ప్రయత్నం కోసం పుస్తకాలతో కుస్తీ పడతారు...."

"రామం గారూ! మీరు చెబుతున్న విషయాలు నాకు తెలియనివి మాత్రం కావని గ్రహించండి. మా వాణ్ణి మీ దగ్గరకు పంపటం లేదని మరోలా భావించకండి. నేనేం జేసినా వాడి బాగుకోసమే!" చీకాగ్గా అన్నాడు భాస్కర్.

"మీకు తెల్సినా తెలియక పోయినా కొన్ని విషయాలు పిల్లల

భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని నాలాంటివారు చెప్పకుండా వుండ లేరండీ! పరీక్షహాల్లో పిల్లలు ఆన్సర్ చేయాల్సిన ప్రశ్నాపత్రాలు, ప్రతియేటా 'డిటెన్షన్' పద్ధతి అంటే మార్కులు సరిగ్గా రానివారిని ఫెయిల్ చేసేవిధానం వున్నప్పుడు ఇప్పుడుకూడా పరీక్షలకు ముందే పిల్లలకు ఆ ప్రశ్నలు తెల్సిపోవడం నిజంగా మా మేస్టర్ల తప్పే! అయితే పబ్లిక్ పరీక్షలకు ఈ అవ కాశం అంతగా లేకపోవడంవల్ల పిల్లల చదువుల్ని పరీక్షించేందుకు చాలా మంచి పద్ధతిది. మామూలు పరీక్షలు మురళిలాంటి వాళ్ళేకాదు, అంతకంటే అధ్వాన్నంగా మార్కు లొచ్చినవాళ్ళుకూడా మాస్టర్ల ప్రభా వంతో మంచి మార్కులతో పాసై పోవచ్చు.

పబ్లిక్ పరీక్షలలో మాత్రం అలాంటి వాళ్ళు పడిపోవటం ఖాయం. పాఠాల్ని విడమరచి చెప్పగలగడమే మాస్టార్ల విధి. ఆ పాఠాల్ని మరోసారి ఇంటిదగ్గర చదువుకోవడమే విద్యార్థులు చేయా ల్సింది. వారికి ఇంకా అర్థం కాకుంటే తలిదండ్రులు తోడ్పడ్డం చేయాలి. అలా చేస్తే మాలాంటి ప్రయివేటు మాస్టర్లు అనవసరం."

"అవుననుకోండి! వాడి పదో క్లాసు పబ్లిక్ పరీక్ష గొడవ మరో రెండేళ్ళ తర్వాత కదండీ! అప్పుడు చూసుకోవచ్చు" అన్నాడు భాస్కర్.

"మీ ఇష్టం! అయితే ఆఖరిగా ఒక్క మాట! మురళిలాంటి పిల్లలు వేసే అడుగులు అమాయ కత్వంతో కూడిన తప్పటడుగులు! వారి అడుగులు తడబడకుండా, తప్పటడుగులు కాకుండా ముందు చూపుతో మనమే వారిని మంచి దారిలో నడిపించాలి. మరిక సెలవు తీసుకుంటాను."

రామం మాస్టారి మాటల్ని అప్పుడు పట్టించుకోనందుకు విచా రించాడు భాస్కర్.

మురళి కూడా రామం మాస్టారి దగ్గర ప్రయివేట్ చదివివుంటే వారి దగ్గర చదువుకున్న అందరి లాగే వాడు కూడా పాసై వుండే వాడని వాపోయాడు.

తనకెలాగూ వాడికి పాఠాలు చెప్పే ఓపిక, తీరిక లేవు. ఇక మీదట్నుంచయినా వాడి చదువు బాగోగులు తానోకంట కనిపెడుతూ వుండాలి. కాస్త తీరిక చేసుకోవాలి.

కుర్రాళ్ళ భవిష్యత్తు గురించి పాటుపడే రామం మాస్టారికి మురళిని అప్పగించాలి!

అలా ఆలోచనలతో సతమత మైన భాస్కర్ అర్జంటుగా మురళిని వెంటబెట్టుకుని రామం మాస్టారి ఇంటికి బయలుదేరాడు. ●